సాక్షి
వరంగల్
గురువారం | 30 | మార్చి | 2023



పగిలిన అద్దాలు.. విరిగిన లాఠీ
టీఎస్‌పీఎస్సీ చైర్మన్, ఇతర సభ్యులను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం కేయూ విద్యార్థి జాక్ ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. -10లో▸



వసంతోత్సవానికి వేళాయె
నిట్ వరంగల్‌లో ప్రతి ఏడాది విద్యార్థులే నిర్వాహకులుగా మూడు రోజుల వసంతోత్సవ సంబురం, స్ప్రింగ్ స్ప్రీ-23 ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్నారు. -10లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం $37^0/24^0$
జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పొగమంచుతో కూడిన ఎండ ఉంటుంది. పొడి వాతావరణంతోపాటు రాత్రి పూట చల్లగా ఉంటుంది.



న్యూస్‌రీల్

భూసార పరీక్షలు చేయించుకోవాలి



వరంగల్ (పర్వతగిరి): రైతులు భూసార పరీక్షలు తప్పక చేయించుకోవాలని ఏరువాక వరంగల్ డాట్ సెంటర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ దిలీప్‌కుమార్, డాక్టర్ వీరన్న సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఫ్యాక్ట్ ఎరువుల కంపెనీ ఆధ్వర్యంలో బుధవారం వ్యవసాయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు అధిక ఎరువుల వాడకాన్ని తగ్గించి భూసారాన్ని పెంచుకోవాలన్నారు. అనంతరం వరి, మొక్కజొన్న పంటలపై అవగాహన కల్పించారు. ఫ్యాక్ట్ ఎరువుల కంపెనీ జోనల్ మేనేజర్ బి.శివేంద్రకుమార్ ఫ్యాక్ట్ కంపెనీ ఎరువులు ఫ్యాక్టంఫాస్, అమోనియం సల్ఫేట్, ఫ్యాక్ట్ జిప్సం, ఫ్యాక్ట్ ఆర్గానిక్‌ల గురించి రైతులకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అమలయ్యే పథకాల గురించి మండల వ్యవసాయాధికారి వివరించారు. కార్యక్రమంలో శ్రీవిష్ణువర్ధన్, సేల్స్ ఆఫీసర్ వందన, రైతులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం తనిఖీ



వర్ధన్నపేట: ఇల్లందలోని కంటి వెలుగు శిబిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మధుసూదన్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కంటి వెలుగు ప్రారంభం నుంచి నేటి వరకు వైద్య పరీక్షలు ఎన్ని నిర్వహించారు.. ఎంత మందికి కంటి అద్దాలు అందించారు.. ఇంకా ఎంత మందికి అందించాల్సి ఉందనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. కంటి పరీక్షలకు వచ్చే వారికి అన్ని సదుపాయాలు అందుతున్నాయా.. అని ప్రశ్నించారు. పరీక్షల్లో మందులు పంపిణీ చేస్తున్నారా.. అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో శిబిరం డాక్టర్ అన్వేష్, డీఈఓ శ్రీనివాస్, ఏఎన్ఎం సరోజన, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ 'ద్వితీయ' పరీక్షలు

కాశీబుగ్గ సెంటర్: జిల్లాలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు బుధవారం ముగిశాయి. 27 కేంద్రాల్లో 6,522 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా.. 6,225 మంది రాశారని, 297 మంది గైర్హాజరయ్యారని డీఐఈఓ కాక మాధవరావు తెలిపారు. జనరల్ కోర్సుల్లో 256, ఒకేషనల్‌లో 41 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

చిరుధాన్యాల్లో పోషక విలువలు



రాయపర్తి: చిరుధాన్యాలతో కూడిన పౌష్టికాహారంలో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయని, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అందించే పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి శారద, సీడీపీఓ శ్రీదేవి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలతోపాటు కాట్రపల్లిలో చిరుధాన్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశుభ్రతతోపాటు ఆకుకూరలతో కూడిన పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉమామహేశ్వర్, సూపర్‌వైజర్ సత్యవతి,విజయలక్ష్మి,హెచ్‌వీ మాధవీలత, ఏఎన్ఎం వనిత, కవిత, సరోజ, కార్తీక్, ఆశ వర్కర్ రాజేశ్వరి పాల్గొన్నారు. కాట్రపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ బోనగిరి ఎల్లయ్య, ఉపసర్పంచ్ రేణుక, సూపర్‌వైజర్ మాధవీలత, వీఓ అధ్యక్షురాలు యాకాంత, రేణుక, రవళి,శోభ,అంగన్‌వాడీ టీచర్ ఎండీ.యాకూబీ, రమ, కనకతార, భాగ్యమ్మ పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ ట్రైనింగ్!

అత్యవసర సమయాల్లో ప్రాణాలు కాపాడే వైద్య సేవలపై శిక్షణ

- ఇప్పటికే ఉస్మానియా మెడికల్ కాలేజీలో నెల్స్ ట్రైనింగ్
- కేఎంసీలోనూ రీజినల్ సెంటర్‌కు శ్రీకారం
- మరో నెలరోజుల్లో వైద్యులు, నర్సులకు మరూ కానున్న శిక్షణ
- తొలుత మాన్‌క్వీన్, ఆ తర్వాత సిమ్యులేటర్స్‌తో ట్రైనింగ్



సాక్షి, వరంగల్: ప్రజలకు నాణ్యమైన.. అత్యవసర వైద్య సేవలు అందించడంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఒక్కసారిగా అస్వస్థతకు గురైన వారికి అత్యవసరంగా అందించే చికిత్సలో మెళకువలు ప్రాక్టికల్‌గా నేర్పేందుకు కాకతీయ మెడికల్ కాలేజీలో త్వరలోనే నేషనల్ ఎమర్జెన్సీ లైఫ్ సపోర్ట్(ఎన్ఈఎల్ఎస్) ట్రైనింగ్ రీజినల్ సెంటర్ అందుబాటులోకి రానుంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే రూ.17కోట్ల వ్యయంతో చేపట్టిన నిర్మాణ పనులు పూర్తి కావొచ్చాయి. వచ్చే నెలలో షురూ కానున్న శిక్షణలో వందలాది మంది వైద్యులు, నర్సులు, అంబులెన్స్ సిబ్బందితోపాటు పారా మెడికల్ సిబ్బందికి కూడా ఎమర్జెన్సీ సేవల్లో అనుసరించాల్సిన తీరుపై ప్రధానంగా తర్ఫీదు ఇవ్వనున్నారు. విదేశాల్లో మాదిరిగానే దేశంలో కూడా నాణ్యమైన వైద్యం అందాలన్న ఉద్దేశంతో కేంద్రం తీసుకొచ్చిన ఎన్ఈఎల్ఎస్ కోర్సు ద్వారా అత్యవసర సమయాల్లో వేలాది మంది రోగులను బతికించే అవకాశం ఉంది. ఎందుకంటే.. రోగి ఆరోగ్యం ప్రమాదకర స్థితిలో ఉన్నప్పుడు అందించే వైద్య సేవల్లో సిబ్బంది చేసే చిన్నచిన్న పొరపాట్లు, ఆ సమయంలో ఏమి చేయాలో తోచకపోవడం, ఎక్విప్‌మెంట్ల వాడకంపై సరైన అవగాహన లేకపోవడం వల్ల ఎమర్జెన్సీ రోగులు బతకడం వేళ్లమీద లెక్కపెట్టొచ్చు. అందుకే.. ఆయా సమయాల్లో ఏమాత్రం తత్తరపాటుకు తావివ్వకుండా వైద్య సేవలు ఎలా అందించాలనే అంశంపై ఒకదాని తర్వాత ఒకటి ప్రాక్టికల్‌గా చేయించనున్నారు. ఇప్పటికే హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రిలోని నెల్స్ కోర్సులో కేఎంసీ కాలేజీ నుంచి నలుగురు ప్రొఫెసర్లు డాక్టర్ విజయ్‌కుమార్ (పిడియాట్రిషన్), మురళి(అనస్తీషియా), నిరంజనాదేవి(గైనకాలజీ), వెంకట్(మెడికల్) ఇటీవల శిక్షణ పొందారు.

ఎలా ఉంటుందంటే...

ముఖ్యంగా మెడికల్, సర్జికల్, కార్డియాక్ ఎమర్జెన్సీ, శ్వాస, గాయ సంబంధిత అత్యవసర పరిస్థితులు, ప్రసూతి అత్యవసర పరిస్థితులు, పిడియాట్రిక్ ఎమర్జెన్సీస్ తదితరాలు అత్యవసర వైద్య సేవల కిందకు రానున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల వైద్యులు, నర్సులతోపాటు మెడికల్ కాలేజీలో చదువుతున్న విద్యార్థులకు నెల్స్ ట్రైనింగ్ ఇవ్వనున్నారు. కార్డియాక్ అరెస్టయిన సమయంలో సీపీఆర్ ఎలా చేయాలి.. ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డిఫిబ్రిలేటర్(ఏఈడీ) మెషీన్లు ఎలా ఉపయోగించాలి.. పిడియాట్రిక్ ఎమర్జెన్సీ సమయంలో బ్యాగ్ మాస్క్ వెంటిలేషన్ టెక్నిక్, గర్భవతుల విషయంలో లెఫ్ట్ యుటరైన్ డిస్‌ప్లేస్‌మెంట్ సమయంలో ఎలా వ్యవహరించాలనే అంశాలను ప్రాక్టికల్‌గా చూపించనున్నారు. ఇలా ఎమర్జెన్సీ ట్రైనింగ్ సర్వీస్ విషయంలో టీమ్‌గా ఎలా విధులు నిర్వర్తించాలనే దానిపై కూడా అవగాహన కల్పించనున్నారు.

మూడు దశల్లో సేవలు

అత్యవసర వైద్య సేవల విషయాల్లో రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు వైద్యులు, నర్సులు, పారా మెడికల్ విద్యార్థుల్లో మేథాశక్తిని పెంపొందించేందుకు ఉద్దేశించిందే నేషనల్ ఎమర్జెన్సీ లైఫ్ సపోర్ట్(ఎన్ఈఎల్ఎస్) కోర్సు. కేఎంసీలో రీజినల్ సెంటర్‌కు ఇప్పటికే రూ1.50కోట్ల విలువ చేసే మాన్‌క్వీన్స్ వచ్చాయి. రూ.10కోట్ల విలువచేసే సిమ్యులేటర్స్ కూడా రానున్నాయి. ఈ కోర్సులో తొలుత మాన్‌క్వీన్స్(బొమ్మలు) ఉపయోగించి అత్యవసర సమయాల్లో ఎలా వ్యవహరించాలో ప్రాక్టికల్‌గా శిక్షణ ఇస్తారు. ఆ తర్వాత సిమ్యులేటర్స్ ద్వారా అంటే.. రోగులకు సర్జరీ చేసినట్టుగానే హ్యాండ్స్ మూవ్ చేయడం వల్ల దేని తర్వాత ఎలా చేయాలన్న స్టెప్పులను అనుకరించాల్సి ఉంటుంది. దీనికి స్కోరింగ్ కూడా వస్తుంది. పర్ఫెక్ట్ చేసేంత వరకు ట్రైనింగ్ ఇస్తారు. ఆ తర్వాత ఆస్పత్రుల్లో నిజంగానే అత్యవసర విభాగంలో రోగులకు ఈ సేవలు అందిస్తారు. సర్జరీలు కూడా చేస్తారు. ఇలా ప్రాక్టికల్ ట్రైనింగ్ ద్వారా ఎమర్జెన్సీ సమయంలో తడబాటు లేకుండా వైద్య సేవలు అందించడం వల్ల ప్రాణాలు నిలిపే అవకాశం ఎక్కువగా ఉంటుంది.



– డాక్టర్ మోహన్‌దాస్, కేఎంసీ ప్రిన్సిపాల్

హరియాణలో పాడి రైతుల అవస్థలు



హరియాణలో డెయిరీ ఫాం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న దళిత పాడి రైతులు

ఐదు రోజులుగా ఆహారం బంద్

- గత 24 గంటల నుంచి కొనసాగుతున్న ధర్నా
- పట్టించుకోని అధికారులు

నర్సంపేట: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పాడి గేదెల కొనుగోలుకు అవకాశం కల్పించినా.. అధికారుల కక్కుర్తితో దళిత రైతులు అవస్థలు పడుతున్నారు. వరంగల్, హనుమకొండ జిల్లాలకు చెందిన రైతులు హరియాణలో ఐదురోజులుగా ఇబ్బందులు పడుతున్నారు. సాయం కోసం ఎదురుచూస్తూ ఆందోళనకు దిగారు.వరంగల్ జిల్లా నల్లబెల్లి, నెక్కొండతోపాటు హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలాలకు చెందిన 50 మంది దళిత రైతులకు ఎస్సీ కార్పొరేషన్ పైలెట్ ప్రాజెక్ట్ పథకం ద్వారా రూ.4లక్షల విలువ చేసే నాలుగు గేదెలను ప్రభుత్వం మంజూరు చేసింది. మొదటి విడతగా హరియాణలో నచ్చిన చోట కొనుగోలు చేసుకోవాలని అధికారులు.. రైతులను ఈనెల 26న నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కించారు. మీరు వెళ్లాక మేము వస్తామని, మీరు వెళ్లాలని సూచించడంతో అధికారుల మాటలు విని రైతులు వెళ్లిపోయారు. హరియాణలోని రోహతక్ జిల్లాలో పాడి గేదెలను సరఫరా చేసే కురాణ డెయిరీ ఫాంనకు చేరుకున్నారు. నచ్చిన గేదెలను చూసుకొని కొనుగోలుకు సిద్ధమయ్యారు. కానీ.. ఇక్కడే అసలు కథ మొదలైంది. తీరా కొనుగోలు చేసే సమయానికి అధికారులు సంబంధిత రైతులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. తాము వచ్చిన చోటకు వచ్చి గేదెలను కొనుగోలు చేసుకోవాలని, లేదంటే పథకాన్ని రద్దు చేస్తామంటూ బెదిరింపులకు దిగారు.

ఐదు రోజులుగా భోజనం బంద్

గేదెల కొనుగోళ్లకు వెళ్లిన రైతులకు ఐదు రోజులుగా స్నానాలతోపాటు భోజనం అందని పరిస్థితి నెలకొంది. వెంట తీసుకెళ్లిన డబ్బులు కూడా ఖర్చు కావడంతో దిక్కుతోచని స్థితిలో ఇబ్బందులు పడుతున్నారు. నచ్చిన గేదెలు కొనుగోలు చేసుకోవాలని ప్రభుత్వ మార్గదర్శకాలు ఉన్నప్పటికి కమీషన్‌ల కోసం కక్కుర్తిపడిన అధికారుల తీరు పాడి రైతుల పాలిట శాపంగా మారింది. దీంతో గమ్యస్థానాలకు ఎలా చేరుకోవాలో అర్థంకాక హరియాణలోని కురాణ డైయిరీ ఎదుట గత 24 గంటల నుంచి ధర్నాకు దిగారు. అధికారులకు ఫోన్లు చేసినా వారి నుంచి ఎలాంటి స్పందన లేదని దళిత పాడి రైతులు మాదాసి సురేష్, వేల్పుగొండ నర్సయ్య, పరికి కోర్నేలు, గంగారపు లింగయ్య, మందపెల్లి శ్రీనివాస్, కోడూరి ప్రవీణ్, స్వామి, మైబు, నర్సయ్య, మల్లేశం, సాంబయ్య, కుమారస్వామి, రాజు వాపోయారు.

సహాయం కోసం ఎదురుచూపులు

పాడి రైతులు అధికారుల తీరుతో నానా తంటాలు పడుతున్నారు. ఐదు రోజులు గడుస్తున్నా అధికారులు మాత్రం రైతుల వద్దకు వెళ్లకపోవడంతో పాడి రైతులు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. కాసుల కోసం కక్కుర్తిపడిన అధికారులపై చర్యలు తీసుకొని, నచ్చిన గేదెలను కొనుగోలు చేయించి తమను గమ్యస్థానాలకు చేర్చే విధంగా తెలంగాణ ప్రభుత్వంతోపాటు ప్రజాప్రతినిధులు, అధికారులు సహాయం చేయాలని కోరుతున్నారు.

ప్రధాన భూమిక మహిళలదే..

- నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట: పరిశుభ్రత, పారిశుద్ధ్యం నిర్వహణ విషయంలో మహిళలదే ప్రధాన భూమిక అని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఎదుట నర్సంపేట మహిళా సమాఖ్య సంఘాల ఆధ్వర్యంలో బుధవారం పట్టణ పారిశుద్ధ్యంపై తమవంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అంబేడ్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణాభివృద్ధిలో భాగంగా పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు తమవంతు పాత్ర పోషించాలన్నారు. ఆరోగ్యవంతమైన పారిశుద్ధ్య పట్టణంగా నర్సంపేట రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందే విధంగా ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనికిషన్,కమిషనర్ వెంకటస్వామి, కౌన్సిలర్లు,పట్టణ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



మహిళలచే ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

సీకేఎం మట్టిలోనే త్యాగం ఉంది

వరంగల్: చందా కాంతయ్య స్మారక కళాశాల మట్టిలోనే త్యాగం ఉందని కేయూ వీసీ తాటికొండ రమేష్, ప్రముఖ పాటల రచయిత మిట్టపల్లి సురేందర్ అన్నారు. దేశాయిపేటలోని సీకేఎం కళాశాలలో బుధవారం జరిగిన 'చైతన్య ఉత్సవం'(కాలేజ్ డే) కార్యక్రమంలో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఈ మట్టి నుంచి జయశంకర్ సార్... వరవరరావు లాంటి వ్యక్తులు వచ్చారన్నారు. చందా విజయ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సుధాకర్‌రెడ్డిలు సందేశం అందజేశారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు చందా శ్రీకాంత్, ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ డాక్టర్ పి.సతీష్‌కుమార్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, లైబ్రేరియన్ అనిల్‌కుమార్, కల్చరల్ కోఆర్డినేటర్ అరుణ, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

'కొమ్మాల' ఆదాయం రూ.44.77లక్షలు

గీసుకొండ: మండలంలోని ప్రసిద్ధ కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు ముగిసిన తర్వాత రెండోసారి హుండీని బుధవారం లెక్కించారు. ఈసారి రూ.9,09,462 ఆదాయం వచ్చిందని ఆయన ఈఓ శేషగిరి తెలిపారు. బ్రహ్మోత్సవాలు, జాతర సందర్భంగా మొదటిసారి హుండీ లెక్కించగా రూ.15,05,039 ఆదాయం వచ్చిందని, హుండీ, వేలంపాటల ద్వారా మొత్తం కలుపుకుని ఈసారి జాతర ద్వారా రూ.35,68,094 ఆదాయం సమకూరిందని వివరించారు. రెండోసారి హుండీని లెక్కించిన ఆదాయం కలుపుకుని మొత్తం రూ.44,77,556 ఆదాయం వచ్చిందన్నారు. గత ఏడాది జాతరలో రూ.30,50,000 ఆదాయం రాగా.. ఈసారి అదనంగా రూ.14,27,555 ఆదాయం వచ్చిందని తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గడ్డమీది కుమారస్వామి, అర్చకులు రామాచార్యులు, క్లర్క్ కనకయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఆలయం వద్ద హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

సీఎంఆర్ మిగులు పూర్తి చేయాలి

- కలెక్టర్ పి.ప్రావీణ్య

వరంగల్ రూరల్: జిల్లాలోని రైస్ మిల్లర్లు కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) మిగులు(బ్యాలెన్స్)ను ఈనెల చివరి వరకు పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్, పౌరసరఫరాల శాఖ, వ్యవసాయ శాఖ అధికారులతో ఖరీఫ్, రబీ 2021-22, 2022-23 సంవత్సరాలకు సంబంధించి ధాన్యం సేకరణ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ధాన్యం సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులపై ఆరా తీశారు. మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు బియ్యం కొరకు గన్నీ సంచులు ఇప్పించాలని, ఎఫ్‌సీఐ గోదాముల్లో ధాన్యం నిల్వకు స్థలాలను పెంచాలని కోరారు. జిల్లా వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్, ఏరియా మేనేజర్, ఎఫ్‌సీఐ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని, అలాగే సీఎంఆర్ బ్యాలెన్స్‌ను ఈనెల చివరి వరకు పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమీక్షలో అదనపు కలెక్టర్ శ్రీవత్స కోట, జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్, పౌరసరఫరాల శాఖ అధికారి గౌరీశంకర్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సంపత్‌కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మిల్లర్లతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

రైతు సమస్యలపై మాట్లాడేవారు కరువయ్యారు

- కొనాయమాకులలో రైతు సంఘం ఉమ్మడి జిల్లా సదస్సు

గీసుకొండ: పార్లమెంట్, అసెంబ్లీ సమావేశాల్లో రైతుల గురించి మాట్లాడే ప్రతినిధులు కరువయ్యారని, గతంలో చరణ్‌సింగ్ లాంటి అనేక జాతీయ పార్టీల నాయకులు రైతు సమస్యలను పార్లమెంట్‌లో చర్చించేవారని తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు రాచర్ల బాలరాజు అభిప్రాయపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తుంటే.. రాజకీయ పక్షాలు రైతన్నల పక్షాన నిలబడే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం గీసుకొండ మండలం కొనాయమాకుల సమీపంలోని ఓంకార్ గార్డెన్‌లో రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్ అధ్యక్షతన 'సంక్షోభంలో భారత వ్యవసాయ రంగం-పరిష్కార మార్గాలు, ప్రభుత్వాల బాధ్యత-మన కర్తవ్యం' అనే అంశంపై ఉమ్మడి జిల్లా సదస్సు జరిగింది. సదస్సులో వెంకటనారాయణ, రమేష్, బాలరాజు మాట్లాడుతూ వ్యవసాయరంగం సంక్షోభంలో ఉందని, రైతుల కష్టాలు తీర్చేవారు లేరన్నారు. వడగళ్ల వాన, ప్రకృతి వైపరీత్యాలకు రైతులు పంటలు నష్టపోయినా ప్రభుత్వాలు స్పందించడం లేదన్నారు. ఎకరానికి రూ.10వేలు కాకుండా రూ.20వేల సహాయం అందించాలని డిమాండ్ చేశారు. సదస్సులో ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరగోని శంకరయ్య, తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, ఉపాధ్యక్షుడు హంసల్‌రెడ్డి, నాయకులు లడే మోహన్‌రావు, మోకిడి పీరయ్య, జంగా జనార్దన్‌రెడ్డి, కర్రు రాజిరెడ్డి, ఆవునూరి రాజు, బోళ్ల ఎల్లయ్య, సేర్ల రవీందర్, జెండా అంబయ్య, సోమిడి సాంబయ్య, రైతు సంఘం ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ వెంకటనారాయణ

రేపు బీజేపీ జిల్లా నూతన కార్యాలయం ప్రారంభం

కాశీబుగ్గ సెంటర్: ధర్మారం-నర్సంపేట రోడ్డులో బీజేపీ జిల్లా నూతన కార్యాలయ భవనాన్ని ఈనెల 31న పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వర్చువల్‌గా ప్రారంభిస్తారని పార్టీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ తెలిపారు. వరంగల్ శివనగర్‌లోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. 31న ఉదయం 6-30 గంటలకు నవగ్రహ, గణపతి పూజ, లక్ష్మీగణపతి హోమం, వాస్తుపూజ నిర్వహించి.. 12-30 గంటలకు నడ్డా కార్యాలయాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ శ్రీనివాస్ గౌడ్ పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు ఎడ్ల అశోక్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, ఉపాధ్యక్షుడు కనుకుంట్ల రంజిత్, కిసాన్ మోర్చా నాయకుడు మల్లాడి తిరుపతిరెడ్డి, ప్రచార కార్యదర్శి బైరి శ్యాంసుందర్, నాయకులు గాడిపెల్లి రాజేశ్వర్‌రావు, కలువల త్రిలోక్, ఒంటెల ప్రసాద్, కారంపాడి ఉమేష్ తదితరలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొండేటి శ్రీధర్

31న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

కేయూ క్యాంపస్: కేయూ భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'మెట్‌ల్యాబ్స్ అండ్ ఇట్స్ అప్లికేషన్' అనే అంశంపై ఈనెల 31న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు విభాగాధిపతి సీజే శ్రీలత, పాఠ్య ప్రణాళిక అధ్యక్షురాలు జి.పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు. 31 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

మెరిసిన మరియపురం!
నాలుగు రోజులు మార్కెట్ బంద్
చోరీ చేసిన సొత్తు ప్రత్యక్షం
పట్టుదల ఉంటే విజయం మీ సొంతం
-12లో▸

కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి

వీసీలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి

వరంగల్ రూరల్: ఏప్రిల్ 3వ తేదీ నుంచి జరిగే పదో తరగతి పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి మంత్రి పరీక్షల నిర్వహణపై విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన తదితరులతో కలిసి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీవత్స మాట్లాడుతూ జిల్లాలో పరీక్షల నిర్వహణకు 56 కేంద్రాలు ఏర్పాటు చేశామని, 9,728 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఇప్పటికే సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేశామన్నారు. వీసీలో డి.వాసంతి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కాజీపేట వెంకటరమణ, నర్సంపేట, వర్ధన్నపేట మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పవిత్ర పండుగ రంజాన్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీవత్స

- అదనపు కలెక్టర్ శ్రీవత్స

వరంగల్ రూరల్: ముస్లింల పవిత్ర పండుగ రంజాన్ అని, పండుగకు ప్రభుత్వం అందించే గిఫ్ట్ ప్యాకెట్లను ప్రణాళికాబద్ధంగా పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ శ్రీవత్స కోట అధికారులను ఆదేశించారు. రంజాన్ పండుగ సందర్భంగా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవత్స మాట్లాడుతూ జిల్లాలో ఇఫ్తార్ విందులకు రూ.12లక్షలు కేటాయించగా.. 6వేల గిఫ్ట్ ప్యాకెట్లను మూడు నియోజకవర్గాల పరిధిలోని 12 మసీదుల్లో పంపిణీ చేయడానికి గుర్తించామన్నారు. ఒక్కో మండలంలో 500 మంది ముస్లింలకు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల సమక్షంలో బట్టల పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఇఫ్తారు విందు నిర్వహించే ప్రదేశాల్లో ప్రభుత్వపరంగా శానిటేషన్, వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా హెల్త్ క్యాంపు ఏర్పాటు చేస్తామన్నారు. పోలీస్ శాఖ ద్వారా బందోబస్తు నిర్వహణ, తాగునీరు వసతి, మహానగర పాలక సంస్థ ద్వారా లైటింగ్ ఏర్పాటుతోపాటు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి కె.విక్రమ్‌కుమార్, బల్దియా అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్, నర్సంపేట ఏసీపీ ఎ.సంపత్‌రావు, వర్ధన్నపేట ఏసీపీ శ్రీనివాసరావు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, ముస్లిం మత పెద్దలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పగిలిన అద్దాలు.. విరిగిన లాఠీ

- కాకతీయ యూనివర్సిటీలో ఉద్రిక్తత
- మహాధర్నా ర్యాలీ, పేపర్ లీకేజీపై ఆగ్రహం
- సంఘర్షణ సభకు అనుమతి ఇవ్వకపోవడంతో పరిపాలనా భవనంలోకి చొచ్చుకెళ్లేయత్నం
- పోలీసుల లాఠీచార్జ్, విద్యార్థి నాయకుడి తలకు గాయం
- విద్యార్థి జేఏసీ నాయకుల అరెస్ట్, కేసు నమోదు


ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, విద్యార్థులు


పోలీసులను అడ్డుకుంటున్న నిరసనకారులు

కేయూ క్యాంపస్: పేపర్ లీకేజీలతో నిరుద్యోగుల జీవితాలతో కేసీఆర్ ప్రభుత్వం చెలగాటమాడుతుందని, వెంటనే టీఎస్‌పీఎస్సీ చైర్మన్, ఇతర సభ్యులను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం కేయూ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో క్యాంపస్‌లోని లైబ్రరీ ఎదుట నిర్వహించిన మహాధర్నా ఉద్రిక్తతకు దారి తీసుకుంది. నిరుద్యోగుల సమస్యలపై చర్చించేందుకు కేయూలో తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల సంఘర్షణ సభను నిర్వహిస్తామని కేయూ విద్యార్థి జేఏసీ అనుమతి కోరితే వీసీ ఆచార్య తాటికొండ రమేశ్ అనుమతి ఇవ్వలేదు. దీంతో ఆగ్రహించిన విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఇదేమి రాజ్యం, ఇదేమి రాజ్యం, దొంగల రాజ్యం, దోపిడీ రాజ్యం అంటూ నినాదాలు చేస్తూ లైబ్రరీ నుంచి పరిపాలనా భవనంవైపు రాగా పోలీసులు భారీ బందోబస్తుతో పరిపాలన భవనం రెండు గేట్లను మూసివేయడంతో రెండో గేటు వైపు ర్యాలీ నిర్వహించారు. రెండో గేటు కూడా మూసివేయడంతో విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు మళ్లీ పరిపాలన భవనం వద్దకు చేరుకుని ధర్నా చేశారు. సంఘర్షణ సభకు అనుమతి ఇవ్వాలని, వెంటనే వీసీ బయటకు రావాలని పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఆందోళన చేశారు. సంఘర్షణ సభకు వీసీ రమేశ్ అనుమతి ఇస్తే మేము శాంతియుతంగా వెళ్లి పోతామని విద్యార్థి జేఏసీ నాయకులు పోలీసులను కోరారు. అయినా వీసీ రాకపోవడంతో పరిపాలనా భవనంలోకి చొచ్చుకెళ్లే యత్నం చేశారు. అప్పటికే ప్రధాన ద్వారం వద్ద మోహరించి ఉన్న పోలీసులు వీరిని అడ్డుకోవడంతో పోలీసులకు విద్యార్థులకు మధ్య తోపులాట జరిగింది. ప్రధాన ద్వారం వద్ద పలు అద్దాలు పగిలిపోయాయి. దీంతో పోలీసులు విద్యార్థి నాయకులపై లాఠీచార్జ్ చేశారు. దీంతో విద్యార్థినాయకులు కొన్ని పూలకుండీలను పగులగొట్టారు. మరోవైపు ఇద్దరు విద్యార్థి నాయకులు పరిపాలన భవనం ఎక్కి తమ నిరసన తెలిపారు. అక్కడి నుంచి దూకుతారని భావించిన పోలీసులు వారిని కిందకు దించివేశారు.


పూలకుండీ పగులగొడుతున్న విద్యార్థి

మరికొందరు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసే యత్నం చేయగా పోలీసులు లాక్కునే యత్నం చేయడంతో విద్యార్థి నాయకులకు పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. ఈ తోపులాటలో విద్యార్థి నాయకుడు మేడ రంజిత్ తలకు గాయం అయింది. దీంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థి నాయకులను పోలీసులు అరెస్టు చేసి ధర్మసాగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

క్రిమినల్ కేసులు నమోదు చేయాలి: కేయూ విద్యార్థి జేఏసీ

రాష్ట్రంలోని 35 లక్షల నిరుద్యోగుల భవిష్యత్‌ను అంగట్లో పెట్టారని కేయూ విద్యార్థి జేఏసీ నాయకులు మండిపడ్డారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్, ఇతర సభ్యులను బర్తరఫ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కోచింగ్ సెంటర్లలో వేల రూపాయలు పెట్టి ప్రిపేర్ అయితే గ్రూప్ 1, తదితర పేపర్ల లీకేజీలతో వారి ఆశలు అడియాశలయ్యాయన్నారు. ఎమ్మెల్సీ కవిత లిక్కర్ కేసులో ఢిల్లీలో ఈడీ విచారణను ఎదుర్కొంటుంటే ప్రజలను, నిరుద్యోగులను గాలికి వదిలేసి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఢిల్లీలో తిష్ట వేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కేయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ ఇట్టబోయిన తిరుపతియాదవ్, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి విజయ్‌ఖన్నా, కోశాధికారి మొగిలి వెంకటరెడ్డి, గిరిజన శక్తి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోతు రాజునాయక్, టీజీవీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడ రంజిత్, ఏబీఎస్‌ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేష్, ఎస్ఎస్‌యూఐ బాధ్యులు అలువాల కార్తీక్, రాకేష్, కృష్ణ, బీఎస్‌ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ బొట్ల మనోహర్, కల్లెపెల్లి ప్రశాంత్, కామగోని శ్రవణ్, వంశీకృష్ణ, బి నర్సింహారావు, బీసీ విద్యార్థి సంఘం కేయూ ఇన్‌చార్జ్ ఆరెగంటి నాగరాజు, జేఏసీ నాయకులు రంజిత్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కేయూ బంద్‌కు పిలుపు

విద్యార్థి నాయకులపై పోలీసుల లాఠీచార్జ్ చేయడాన్ని నిరసిస్తూ నేడు (గురువారం) కేయూ బంద్‌కు పిలుపు నిస్తున్నట్లు ఏబీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ తెలిపారు. విద్యార్థినాయకుల అరెస్టును నిరసిస్తూ కేయూలో నిరసన తెలిపారు.

ప్రభుత్వానికి తొత్తుగా వ్యవహరిస్తున్న వీసీ రమేశ్



సంఘర్షణ సభకు అనుమతి ఇవ్వకుండా వీసీ ఆచార్య రమేశ్ ప్రభుత్వానికి తొత్తుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైన 30 లక్షల మంది నిరుద్యోగుల నియామకాలపై నమ్మకం కలగాలంటే టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యులను బర్తరఫ్ చేయాలి. పేపర్ లీకేజీని సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలి.

–తిరుపతి యాదవ్, కేయూ విద్యార్థి జాక్ చైర్మన్

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం..



ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతుంది. పేపర్ లీకేజీపై టీఎస్‌పీఎస్సీ చైర్మన్, కేసీఆర్ ప్రభుత్వం బాధ్యత వహించాలి. సంఘర్షణ సభకు వీసీ అనుమతి ఇవ్వకపోవడం శోచనీయం.

–మేడ రంజిత్, టీజీవీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

13మందిపై కేసు

వీసీ ఆచార్య రమేశ్ ఫిర్యాదు మేరకు 13 మంది విద్యార్థి సంఘం నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా హనుమకొండ జిల్లా బీజేపీ అధ్యక్షురాలు రావు పద్మ విద్యార్థి నాయకులను పరామర్శించారు.

గంజాయి స్మగ్లర్ల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సీతారాం

జనగామ: ఏపీ, ఒరిస్సా రాష్ట్రాల నుంచి గంజాయి స్మగ్లింగ్ చేస్తూ జిల్లాలో అమ్మకాలు చేస్తున్న ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ పి. సీతారాం తెలిపారు. బుధవారం డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ దేవేందర్‌రెడ్డి, నర్మెట సీఐ నాగబాబు, ఎస్సై ఎస్‌కె జానీపాషాతో కలిసి వివరాలు వెల్లడించారు. వరంగల్ కరీమాబాద్‌కు చెందిన కూకట్ల నిశాంత్, గోవిందరాజుల గుట్టకు చెందిన బొల్లి లక్ష్మణ్, భూపాలపల్లికి చెందిన మహ్మద్ అజహర్, తొగరి నిఖిల్, తొర్రూరు మండలం మడిపల్లికి చెందిన సిరబోయిన కృష్ణ, మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురుకు చెందిన చీకటి కిరణ్‌లు కలిసి రెండు రాష్ట్రాల మీదుగా వరంగల్, జనగామ ప్రాంతాలకు గంజాయి స్మగ్లింగ్ చేస్తున్నారు. జనగామ జిల్లా తరిగొప్పులకు చెందిన మహ్మద్ జలీల్‌తో కలిసి నిశాంత్ గంజాయి అమ్మకాలు చేసే వారు. ఇటీవల జలీల్ పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్లడంతో బుల్లి లక్ష్మణ్, అజహర్‌తో కలిసి నిశాంత్ సులభతరంగా డబ్బులు సంపాదించాలనే అత్యాశతో జిల్లాలోని అనేక ప్రాంతాల్లో గంజాయి సప్లయ్ చేస్తున్నారు. నెల్లికుదురుకు చెందిన కృష్ణమూర్తి, కిరణ్‌పై వరంగల్, మహబూబాబాద్, ఖమ్మంలో గంజాయి కేసులు నమోదు కావడంతో పోలీసుల కళ్లు కప్పి వారి మకాం జనగామకు మార్చుకున్నారు. గంజాయి రవాణా చేస్తున్నారనే పక్కా సమాచారం మేరకు నర్మెట మండల కేంద్రం హెచ్‌పీ, ఏసర్ పెట్రోలు బంకులు, దుర్గమ్మ ఆలయం సమీపంలో పోలీసులు వేర్వేరుగా తనిఖీలు చేపట్టగా వాహనాలపై వెళ్తున్న ఆరుగురు వ్యక్తులపై అనుమానం వచ్చి తనిఖీలు చేయగా వీరి నుంచి రూ.1.20 లక్షల విలువ చేసే ఆరు కిలోల గంజాయి, మూడు సెల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయి స్మగ్లర్లను పట్టుకున్న సీఐ నాగబాబు, ఎస్సై జానీపాషా, హెడ్ కానిస్టేబుల్ గట్టయ్య, కానిస్టేబుళ్లు ధనుంజయ్, ప్రవీణ్, రహమత్‌అలీ, హమీద్, రాజు, రమేష్, గాలిబ్‌లను డీసీపీ అభినందించారు.

వసంతోత్సవానికి వేళాయె

- దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద కల్చరల్ ఫెస్ట్
- నిట్‌లో ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో స్ప్రింగ్‌స్ప్రీ–23
- ప్రారంభోత్సవంలో పాల్గొననున్న పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్


కళాధ్వనిని ఆవిష్కరిస్తున్న నిట్ డైరెక్టర్ రమణారావు

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో ప్రతి ఏడాది విద్యార్థులచే నిర్వాహకులుగా మూడు రోజుల వసంతోత్సవ సంబురం, సంస్కృతి సంప్రదాయాలను పంచుకునే వేదికగా నిలుస్తున్న స్ప్రింగ్ స్ప్రీ–23 ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్నారు. నిత్యం విద్యతో కుస్తీ పడుతూ ప్రపంచస్థాయిలో తమ ప్రతిభను చాటుకుంటున్న నిట్ విద్యార్థులు తోటి విద్యార్థులతో పాటు దేశవ్యాప్త ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులతో ఆ ప్రాంత సంస్కృతి సంప్రదాయాలను, మన సంస్కృతి సంప్రదాయాలను పరస్పరం పంచుకుంటూ యాన్యువల్ స్పోర్ట్స్ మీట్‌గా ఏర్పాటు చేసుకుని మూడు రోజుల వేడుకకు శ్రీకారం చుట్టారు. దేశవ్యాప్తంగా వివిధ కళాశాలల నుంచి 20వేల మంది విద్యార్థులు ఈ ఏడాది స్ప్రింగ్‌స్ప్రీ వేడుకల్లో పాల్గొననున్నారు. ఇది దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద కల్చరల్ ఫెస్ట్‌గా నిట్ వరంగల్ స్ప్రింగ్‌స్ప్రీ నిలుస్తుంది.

ప్రతి ఏడాది ప్రత్యేక థీంతో..

నిట్ వరంగల్ ప్రతి ఏడాది నిర్వహిస్తున్న స్ప్రింగ్‌స్ప్రీ వసంతోత్సవ వేడుకలకు ప్రత్యేక థీంను రూపొందిస్తారు. ఈ ఏడాది స్ప్రింగ్‌స్ప్రీ–23కి కళాధ్వనిగా నామకరణం చేశారు. 2019లో కళాక్షేత్ర, 2020లో మితియాస్, 2022లో సృష్టి, 2023లో కళాధ్వనిగా నామకరణం చేశారు.

55కు పైగా ఈవెంట్స్..

ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించే స్ప్రింగ్‌స్ప్రీ–23 కళాధ్వనిలో 55కు పైగా ఈవెంట్స్‌తో అలరించనుంది. తొలిరోజు 7న టాలీవుడ్‌నైట్ పేరిట టాలీవుడ్ సింగర్స్ నిట్ మైదానంలో అలరించనున్నారు. రెండో రోజు 8న డీజే నైట్, సన్‌బర్న్ పేరిట డీజేలు వివిధ రకాల పాటలతో అలరించనున్నారు, మూడో రోజు 9న బాలీవుడ్‌నైట్ పేరిట బాలీవుడ్ సింగర్స్ ఉర్రూతలూగించనున్నారు. వీటితో పాటు మూడురోజుల పాటు ప్రా షోలు, స్పాట్ లైట్స్, స్యాండ్ ఆర్ట్, సైలెంట్ డీజేస్, మాస్టర్ చెఫ్, జుంబాడ్యాన్స్, కొరియో నైట్, వార్ ఆఫ్ డీజెస్, ఐడల్, అల్యూర్‌లతో వసంతోత్సవం కలర్ ఫుల్‌గా సాగనుంది.

ప్రతిష్టాత్మకంగా స్ప్రింగ్‌స్ప్రీ–23 కళాధ్వని

నిట్ వరంగల్‌లో నిర్వహించనున్న మూడు రోజుల స్ప్రింగ్‌స్ప్రీ–23 కళాధ్వనిని ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో వేడుకలను ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్నామని నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు తెలిపారు. బుధవారం నిట్‌లోని సుభాష్‌చంద్రబోస్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను అలవర్చేందుకు, సంస్కృతి సంప్రదాయాలను పరస్పరం పంచుకునేందుకు స్ప్రింగ్‌స్ప్రీ వేడుకలు విద్యార్థులే నిర్వాహకులుగా నిర్వహిస్తున్నారు. రెండు నెలల పాటు 200 మంది విద్యార్థులు నిట్‌లోని వివిధ క్లబ్స్‌తో మమేకమై కోర్‌టీంలుగా ఏర్పడి ఈ వేడుకలను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ పులి రవికుమార్, ఫ్యాకల్టీ అడ్వైజర్ హీరాలాల్, కోర్ టీం వంశీకిషోర్, అజయ్‌కుమార్, పీయూష్‌కుమార్, సాయిగురునాథ్ పాల్గొన్నారు.

ప్రారంభోత్సవానికి పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్



నిట్ వరంగల్ స్ప్రింగ్‌స్ప్రీ–23 కళాధ్వనీ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా సినీ హీరో పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ఏప్రిల్ 6న ముఖ్యఅతిథిగా పాల్గొని స్ప్రింగ్‌స్ప్రీ–23 వేడుకలను నిట్ మైదానంలో ప్రారంభించనున్నారు. పవన్ కల్యాణ్‌ను చూసేందుకు నిట్ వరంగల్ విద్యార్థులతో పాటు ఓరుగల్లు వాసులు ఎదురు చూస్తున్నారు. నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఎంట్రీ పాసుల కోసం ఇప్పటికే క్రేజ్ మొదలైంది. స్ప్రింగ్‌స్ప్రీ–23 వేడుకల్లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్లను నిట్ ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్‌లో క్యూఆర్‌కోడ్‌లతో అందజేస్తున్నారు.

తెల్లారిన బతుకులు

- కూలీల ఆటోపైకి దూసుకొచ్చిన కారు
- ఇద్దరు కూలీలు మృతి, ఐదుగురికి తీవ్ర గాయాలు
- పరకాల చలివాగు వద్ద ఘటన


కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలైన కూలీలు


చేరాలు మృతదేహం


దుబాసి కోమల (ఫైల్)

పరకాల: కారు డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం ఇద్దరు కూలీలను పొట్టనపెట్టుకోగా మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన హన్మకొండ జిల్లా పరకాల పట్టణంలోని చలివాగు వంతెన శివారులో బుధవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన ఏడుగురు కూలీలు అదే గ్రామానికి చెందిన మద్దెబోయిన సందీప్‌కు చెందిన ఆటోలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు మిర్చి తోట ఏరటానికి బుధవారం తెల్లవారుజామున బయలుదేరారు. పరకాల చలివాగు వంతెన సమీపంలోకి రాగానే ఎదురుగా అతివేగంగా దూసుకొచ్చిన కారు ఆటో కుడివైపు ఢీకొని ముళ్లపొదల్లో పడిపోయింది. దీంతో ఒక్కసారిగా ఆటోలో ప్రయాణిస్తున్న కూలీలంతా ఎగిరిపడి తీవ్ర గాయాలయ్యాయి. కుడివైపు కూర్చున్న కొంగరి చేరాలు(57), దుబాసి కోమల (56)కు తీవ్ర గాయాలు కావడంతో ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. మరొకరు సిలువేరు కొంరమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. తీవ్రగాయాలైన పసుల భిక్షపతి, దుబాసి సూరమ్మ, కొంగరి లక్ష్మీ, సాలికి స్వరూపలు ఎంజీఎంలో చికిత్స పొందుతున్నారు.

పోలీసుల మానవత్వం

రోడ్డు ప్రమాదంలో కూలీలకు తీవ్రగాయాలైన సమాచారం తెలియగానే పరకాల సీఐ పుల్యాల కిషన్, ఎస్సై ప్రశాంత్, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని రక్తం మడుగులో ఉన్న కూలీలను ఎత్తుకొని 108లో ఆస్పత్రికి తరలించారు. కాగా బాధితుల ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన మహారాష్ట్రలోని సిరొంచ మండలం ఆసరవెల్లి గ్రామానికి చెందిన గుండు తేజపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కలుషిత నీరు తాగి కూలీలకు అస్వస్థత


వాంతులు చేసుకుంటున్న కూలీలు

వెంకటాపురం(కె): ములుగు జిల్లా వెంకటాపురం (కె) మండలం ఉప్పేడు గొల్లగూడెం గ్రామంలో మిర్చి తోటలోకి కూలి పనులకు వెళ్లిన 25 మంది కూలీలు కలుషిత నీరు తాగి అస్వస్థతకు గురైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం... ఉప్పేడు గొల్లగూడెం గ్రామానికి చెందిన 25 మంది కూలీలు గ్రామ సమీపంలోని మిర్చి తోటలో కూలి పనులకు వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో కూలీలు భోజనం చేసిన అనంతరం డ్రిప్ పైప్ నుంచి వచ్చే నీటిని తాగారు. అయితే డ్రిప్ పైపులు శుభ్రం చేసేందుకు రైతులు ఓ ద్రావకాన్ని వదిలారు. ఆ విషయం తెలియని కూలీలు నీరు తాగడంతో వాంతులు చేసుకుని అస్వస్థతకు గురయ్యారు. గమనించిన గ్రామస్తులు ఆటో వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఏటూరు నాగారం ఆస్పత్రికి తరలించారు.